క్లుప్తంగా

కార్తికేయునికి వెండి పళ్లెం సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మోపిదేవి వాస్తవ్యులు గజ్జల బాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, భార్గవి శాలిని దంపతులు రూ.55 వేలు విలువ గల 820 గ్రాముల వెండి పళ్లెం సమర్పించారు. గురువారం ఉదయం స్వామివార్లను దర్శించుకున్న ఆ దంపతులు ఆలయ అధికారులకు వెండి పళ్లెం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు బర్మా ప్రసాద్, వెంకట్రాద్రి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులున్నా వైఎస్సార్ సీపీ ప్రచార సామగ్రి సీజ్

పెడన: వైఎస్సార్ సీపీ ప్రచార సామగ్రిని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం గురువారం మధ్యాహ్నం సీజ్ చేసింది. పార్టీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న అద్దె ఇంట్లో పార్టీకి సంబంధించి ప్రచార సామగ్రి, జెండాలు, సీఎం జగన్ ముఖచిత్రం మాస్కులు, టోపీలు తదితర వాటిని సీజ్ చేశారు. వీటికి సంబంధించి బిల్లులు చూపించినా వినిపించుకోకుండా వాటిని సీజ్ చేసి త్రీమెన్ కమిటీకి తెలియజేయాలని సదరు అధికారులు పేర్కొనడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు పంచాయతీ శివారు 10వ మైలురాయి వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఒక రైతు పొలం నుంచి సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా బంటుమిల్లి నుంచి అర్తమూరు వైపు వెళుతున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సైకిల్‌పై ఉన్న వ్యక్తితో పాటు ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా రోడ్డుపై పడిపోవడంతో గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను 108 ద్వారా బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ జి.వాసు తెలిపారు.

రంజాన్ తోఫా కిట్లు పంపిణీ

కోడూరు: కోడూరులోని ముస్లింలకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రఫీ రంజాన్ తోఫా కిట్లను గురువారం పంపిణీ చేశారు. మసీదు ఆవరణలో 80 మంది ముస్లిం కుటుంబాలకు ఈ కిట్లను అందించారు.

దీవించమ్మా.. వేళ్లమ్మా..!

నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న మహిళలు



కోడూరు: కోరిన కోర్కెలు తీర్చే కల్వపల్లి లింగారెడ్డిపాలెం వేళ్లమ్మ అమ్మవారి జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవారి మూలమూర్తిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్ది, పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ యువకులు కత్తిసాము, వీరతాడుతో విన్యాసాలు చేస్తూ భక్తిభావం చాటుకున్నారు. గురువారం ఉదయం ప్రతి ఇంటి వద్ద నుంచి మహిళలు పెద్దఎత్తున నైవేద్యాలు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అన్నం రాశిని అమ్మవారికి సమర్పించి, పంటలు బాగా పండి గ్రామం సుభిక్షంగా ఉండాలంటూ పూజలు చేశారు. గ్రామ ప్రముఖులు అమ్మవారికి, పోతురాజు స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. పలువురు భక్తులు భారీ ప్రభలను ఊరేగించారు.

నవోదయకు ఎంపిక



తెలుగురావుపాలెం(ఘంటసాల): జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో ఘంటసాల మండలం తెలుగురావుపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని రాచూరి మనస్వి 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించింది. సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు ఆమెను అభినందించారు.

చిన్నాపురంలో సాయుధ బలగాల కవాతు

కోనేరుసెంటర్: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మండల పరిధిలోని చిన్నాపురం గ్రామంలో గురువారం సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో ఎస్‌ఐలు పద్మ, చాణక్య, సాయుధ బలగాలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

బంటుమిల్లి: స్థానిక లక్ష్మీపురం సెంటర్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాలరమేష్(రాము) ముఖ్యఅతిథులుగా పాల్గొని కార్యాలయం ప్రారంభిస్తారని తెలిపారు.

పింఛను అగచాట్లు - వృద్ధుల పాట్లు

- అవ్వాతాతల ఆపసోపాలు
- మండుటెండలో ముదిమి వయస్కుల ఇక్కట్లు
- దివ్యాంగుల అవస్థలు

పెడన: టీడీపీ అనుచరుల ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టిన నేపథ్యంలో లబ్ధిదారులు ఏప్రిల్ నెల పింఛన్లు సచివాలయానికి వెళ్లి తీసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. సచివాలయం దాకా నడవలేక మధ్య మధ్యలో ఆగుతూ...కాసేపు సేద తీరుతున్నారు. నానా కష్టాలు పడి ఎలాగోలా గ్రామ, వార్డు సచివాలయాలకు చేరుకుని పింఛను నగదు తీసుకుంటున్నారు. తమకు ఈ అవస్థలు కల్పించినందుకు చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయం మెట్లు ఎక్కలేక...

పుల్లపాడు గ్రామ సచివాలయం మెట్లు ఎక్కడానికి వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శివారు ప్రాంతాల నుంచి వచ్చే వృద్ధులు అక్కడక్కడ సేద తీరుతూ నీడలో ఉంటూ సచివాలయానికి చేరుకుని పింఛను తీసుకుంటున్నారు. నందిగామ పంచాయతీ పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్ శివనాగు, పంచాయతీ కార్యదర్శి షణ్ముఖ్ బెడ్‌పై ఉన్న వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. దావోజీపాలెంగూడెంకు చెందిన గ్రేసీ(13)మంచంపైనే ఉంటుంది. నందిగామకు చెందిన యర్రంశెట్టి వంశీకృష్ణ దివ్యాంగుడికి కూడా పింఛను ఇంటికి తీసుకువెళ్లి అందజేశారు. పట్టణంలోని 4, 5వ సచివాలయాల పరిధిలో పింఛన్లు పై అంతస్తులో కాకుండా కిందే ఇస్తుండటంతో వృద్ధులకు కొంతమేరకు కష్టాలు తప్పాయి.

మండుటెండలో పింఛన్ కోసం పాట్లు

కృత్తివెన్ను: వేకువజామున ఇంటి వద్దనే పింఛన్ అందుకుంటున్న వృద్ధులు, వికలాంగులు ఎన్నికల కమిషన్ నిర్ణయంతో మండుటెండలో సచివాలయాల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో వృద్ధులు, వికలాంగులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. గురువారం మండు టెండలో దూర ప్రాంతాల నుంచి వృద్ధులు పింఛన్ల కోసం సచివాలయాల వద్దకు నానా పాట్లు పడుతూ చేరుకున్న



పెనుమల్లి సచివాలయం వద్దకు స్టాండ్ సహాయంతో వచ్చి పింఛను తీసుకుంటున్న వికలాంగుడు



యండపల్లి సచివాలయానికి మండు టెండలో వస్తున్న ఈమని శేషారత్నం

తీరు చూసినవారిని కలవరపరిచింది. ఇంటి వద్దకు వచ్చి సేవలందించే జగనన్న ప్రభుత్వాన్ని ఏదో చేయాలని చంద్రబాబు అండ్ కో పేద వర్గాలను ఇబ్బందులుపాలు చేశారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

80 శాతం పైగా పింఛన్ల పంపిణీ పూర్తి

కోడూరు: సచివాలయాల వద్ద రెండో రోజు కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగింది. కోడూరు మండలంలో గురువారం సాయంత్రానికి 80 శాతంకు పైగా పెన్షన్ల పంపిణీ పూర్తి అయినట్లు



పుల్లపాడు సచివాలయం వద్ద మెట్లు ఎక్కడానికి ఇబ్బందులు పడుతున్న వృద్ధురాలు

ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. పెన్షన్లు తీసుకొనేందుకు సచివాలయాలకు వృద్ధులు, దివ్యాంగులు పెద్దసంఖ్యలో క్యూ కట్టారు. ఉద్యోగస్తులు సైతం వారికి సహకరిస్తూ పింఛన్ నగదును అందిస్తున్నారు. అయితే ఇంటి వద్ద పెన్షన్లు ఇవ్వకపోవడంపై పెన్షన్‌దారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

పింఛన్ల పంపిణీలో బందరు ప్రథమస్థానం

నగరంలో 92.63 శాతం పింఛన్ల పంపిణీ



36వ డివిజన్‌లో పింఛన్లు తీసుకునేందుకు వచ్చిన వృద్ధులు

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నం పింఛన్ల పంపిణీలో జిల్లాలో మొదటిస్థానంలో నిలిచింది. మొదటి రోజైన బుధవారం 48.80 శాతం మేర పూర్తికాగా, గురువారం రాత్రి 7.30 గంటల సమయానికి 92.63 శాతం పంపిణీ పూర్తయింది. నగరంలో మొత్తం 19,136 పింఛన్లు ఉండగా గురువారం నాటికి 17,726 పింఛన్లు పంపిణీ చేశారు. ఇంకా 1410 పింఛన్లు మాత్రమే పంపిణీ చేయాల్సి ఉంది.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

- వైఎస్సార్‌సీపీ బందరు ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్
- గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

కోడూరు: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అహర్నిశలు ప్రజల అభివృద్ధి కోసం శ్రమిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు కోరారు. కోడూరు మండలం ఉల్లిపాలెం, హంసలదీవి, పిట్టల్లంక, సాలెంపాలెం గ్రామాల్లో గురువారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. విద్యా, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తూ గ్రామస్థాయిలో కార్పొరేట్ తరహా విద్య, వైద్యాన్ని పేద ప్రజలకు అందించారన్నారు. దివిసీమ ప్రజలకు ఉపయోగపడేలా మచిలీపట్నంలో మెడికల్ కళాశాలను నిర్మించి ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులకు అన్ని విధాలుగా అండగా నిలవడంతో పాటు కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు.

తండ్రికి తగ్గ తనయుడిని అనిపించుకుంటా..

తన తండ్రి దివంగత సింహాద్రి సత్యన్నారాయణ



హంసలదీవి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు

ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన కృషిని ప్రజలు ఇప్పటికీ మరువలేదని, ఇదే స్ఫూర్తితో తాను కూడా ప్రజలకు సేవ చేస్తానని చంద్రశేఖరరావు చెప్పారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, ఈ ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చంద్రశేఖరరావు దగ్గర వైద్యసేవలు పొందిన పలువురు గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రాణాలను కాపాడిన దేవుడంటూ హారతులు పట్టారు. ఇంటింటికీ తిరిగి చంద్రశేఖరరావు తన ప్రచారాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, సర్పంచి కొక్కిలిగడ్డ భిక్షాలు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట

మల్లవోలు ప్రజాదీవెన యాత్రలో ఉప్పాల రాము

గూడూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో సంక్షేమంతో పాటుగా అభివృద్ధికి పెద్దపీట వేశామని పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలసి గూడూరు మండలం మల్లవోలులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన రాము మాట్లాడుతూ గడచిన ఐదేళ్ల కాలంలో పెడన నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1530 కోట్ల మేర లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేశారన్నారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు కావడం రాష్ట్రంలో ఇదే మొదటిసారన్నారు. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మారుమూల గ్రామమైన మల్లవోలులో బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. తద్వారా బాలికలు సుదూర ప్రాంతాలు వెళ్లకుండానే ఉన్నత విద్య అభ్యసించే అవకాశం కలిగిందన్నారు. గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా నిరక్షరాస్యత 12 నుంచి 6 శాతానికి తగ్గిందన్నారు. ఎంతో దూరదృష్టితో పరిపాలన సాగిస్తున్న జగనన్నకు మద్దతు ఇస్తూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాలని ఉప్పాల రాము అభ్యర్థించారు.

ఐదేళ్లలో గ్రామంలో రూ.5 కోట్ల అభివృద్ధి పనులు గ్రామానికి గత ఐదేళ్ల కాలంలో రూ.5కోట్ల విలువైన



మల్లవోలు పర్యటనలో అవ్వ బాగోగులు అడిగి తెలుసుకుంటున్న ఉప్పాల రాము

అభివృద్ధి పనులు చేశారని ఉప్పాల రాము తెలిపారు. గ్రామంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలతో పాటుగా పోలవరం నుంచి ఆకుమర్రు వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. వీటితో పాటు నాడు–నేడు ద్వారా పాఠశాలల ఆధునికీకరణ, అంతర్గత సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. రానున్న కాలంలో కూడా మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలలో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి అఖండ విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, సర్పంచి బొర్రా సాంబయ్య, పార్టీ అధ్యక్షుడు పర్ణం పెదబాబు, పీఏసీఎస్ చైర్మన్ దాసరి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు పిట్ల రామిరెడ్డి, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాజా ఓటర్ల జాబితాలు సిద్ధం



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటరమణ

- పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి ఉద్యోగులకు సమాచారం ఇవ్వండి
- 85 ఏళ్లు వయస్సు పైబడి నడవలేని వారికి ఇంటి వద్ద ఓటు హక్కు
- రాజకీయ పార్టీ నాయకులతో ఈఆర్వో వెంకటరమణ

పెడన: పెడన నియోజకవర్గానికి సంబంధించి తాజా ఓటర్ల జాబితాలను సిద్ధం చేశామని 2024 మార్చి 30వ తేదీ కటాఫ్‌గా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ జాబితాను రూపొందించామని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ తెలిపారు. పెడనలోని తహసీల్దారు కార్యాలయంలోని తన చాంబరులో గురువారం ఆయన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో తాజా ఓటర్ల జాబితాలను గుర్తింపు పొందిన ఆయా రాజకీయ పార్టీల నాయకులకు అందజేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులైన ప్రభుత్వ ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, వారు ఏ ప్రాంతంలో ఉద్యోగం చేస్తుందీ, ఎక్కడ నివాసం తదితర ఆధారాలతో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను ఫెసిలిటీ సెంటర్లలో ఇవ్వాల్సి ఉంటుందని, ఒకటి తహసీల్దారు కార్యాలయంలో, మరొకటి శిక్షణ సమయంలో శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తామని, ఈ సమాచారం ఉద్యోగులకు చేరేలా చూడాలని సూచించారు. 85 ఏళ్లు దాటి నడవలేని వారికి, ఓటు హక్కు కలిగి మంచంపై ఉన్న మానసిక వికలాంగులకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవడానికి వారి నుంచి అనుమతి తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బందారు మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు కోడూరు శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు శ్యామలయ్య తదితరులున్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



బంటుమిల్లి: ఎన్నికల బందోబస్తులో భాగంగా కేంద్ర బలగాలు, పోలీసులు గురువారం పలు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్‌ఐ జి.వాసు ఆధ్వర్యంలో పెదతుమ్మిడి, చినతుమ్మిడి గ్రామాల్లో వీధుల్లో మార్చ్ చేసి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. ఎటువంటి వివాదాల జోలికి పోకుండా, గొడవలకు తావు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమాండర్ సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీల నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని పెదకళ్లేపల్లిలో గ్రామ సచివాలయ కన్వీనర్ అరజా వెంకట చలపతిరావు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం టీడీపీ, జనసేన పార్టీల నుంచి 20 కుటుంబాలవారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే, కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రారంభం నుంచి జనసేన పార్టీకి పనిచేసిన వారిని కాదని, రాత్రికి రాత్రి టీడీపీ నుంచి జంప్ చేసి జనసేన పార్టీ కండువా కప్పుకోవడానికి మండలి బుద్ధ ప్రసాద్‌కు సిగ్గులేదన్నారు. పార్టీలు, జెండాలు మార్చడం తనకు అలవాటు లేదన్న మండలి సీటుపై వ్యామోహంతో కండువాలు కప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేగా తాను, ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు విజయం సాధించడం ఖాయమని అన్నారు. కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ టీడీపీ నుంచి వలస వచ్చిన బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వడంపై అసలైన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలోచించుకోవాలని సూచించారు. సీపీఎం నాయకుడు తలవుల సుధాకర్ మాట్లాడుతూ జగనన్న పేదవర్గాలకు అండగా నిలిచారని, అందుకే తాను సీపీఎంను వదిలి వైఎస్సార్ సీపీలో చేరానని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికపాటి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు, మాజీ సర్పంచ్ అరజా వెంకట సుబ్బారావు, మాజీ ఉపసర్పంచ్ గండు సాంబశివరావు, ఎస్సీసెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, గండు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ నుంచి గంధం నరసింహారావు, అరజా దానయ్య, గుమ్మడి నరసింహారావు, గంజాల రవి, కోట పోతురాజు, జనసేన నుంచి గోళ్ల పిచ్చయ్య, ఉప్పే రామారావు, ఉప్పాల సాంబశివరావు, అరజా శ్రీనివాసరావు, అరజా సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ నుంచి బావిశెట్టి ఏడుకొండలు, గెట్ల వెంకట రత్నం నాయుడు తదితరులు ఉన్నారు.



పెదకళ్లేపల్లిలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే రమేష్‌బాబు

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

పెడన: పట్టణంతో పాటు మండలంలోని వివిధ వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లు గురువారం రాజీనామాలు చేశారు. మండలంలోని బల్లిపర్రులో 13 మంది, చెన్నూరులో ఒకరు, గురువిందగుంటలో ఇద్దరు, చోడవరంలో ఆరుగురు, కొప్పెల్లిలో 8, నందమూరులో ఒకరు మొత్తం 31 మంది రాజీనామా చేశారు. అయితే పెనుమల్లి గ్రామ సచివాలయం పరిధిలో కూడా కొందరు రాజీనామా పత్రాలను మహిళా పోలీస్‌కు అందజేశారు. అవి ఇంకా మండల ఉన్నతాధికారులకు చేరలేదు. పెడన పట్టణంలోని 7, 8వ వార్డుకు చెందిన వలంటీర్లు 15 మంది రాజీనామా చేశారు.

కలపటంలో వలంటీర్ల రాజీనామా

గూడూరు: మండలంలోని లేళ్లగరువు గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న కలపటంలో పనిచేస్తున్న ముగ్గురు వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు.ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి లోయ శివ నాగేశ్వరరావుకు వేర్వేరుగా రాజీనామా లేఖలు సమర్పించారు.

ముంజులూరులో...

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు, అర్తమూరు–2 సచివాలయం పరిధిలోని వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రామకృష్ణరాజుకు అందజేశారు. రెండు సచివాలయాల నుంచి 10 మంది చొప్పున 20 మంది రాజీనామాలు చేశారు.



బల్లిపర్రు గ్రామ సచివాలయ పరిధిలో రాజీనామా పత్రాలను కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు



బంటుమిల్లి ఎంపీడీఓకు రాజీనామాలు అందజేస్తున్న ముంజులూరు వలంటీర్లు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

కోనేరుసెంటర్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బందరు నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తెలిపారు. మండల పరిధిలోని చిన్నాపురం గ్రామంలో గురువారం జరిగిన గడపగడపకు మన సంక్షేమం కార్యక్రమంలో కిట్టు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని పాత ఊరు, వేంకటేశ్వరస్వామి గుడి వీధి, మెరకవీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం కష్టపడే నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, అలాంటి నాయకుడిని మళ్లీ మనం ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే అందరం సంతోషంగా ఉంటామన్నారు. పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వైఎస్సార్ సీపీకి అండగా నిలబడి అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా



చిన్నాపురంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తున్న పేర్ని కిట్టు

వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకె వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ డివిజన్ ఇన్‌చార్జ్ చిటికెన నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ తోట వాసు, చిన్నాపురం గ్రామ ఇన్‌చార్జి జంపాన సుబ్రహ్మణ్యం, ఎస్.గొల్లపాలెం సర్పంచ్ బండి దేవానందం, రాజులపాటి వెంకటేశ్వర గౌడ్ పలువురు గ్రామస్తులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగాయలంకలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పర్యటన

వ్యాపారులు, ప్రముఖులను కలిసిన సింహాద్రి జోడి

నాగాయలంక: బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు గురువారం రాత్రి నాగాయలంకలో పర్యటించి వ్యాపారస్తులు, పెద్దలతో మమేకం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు ప్రముఖులను ఆత్మీయంగా పలకరించి బాగోగులు తెలుసుకున్నారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.1858 కోట్ల మేరకు అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జగనన్న గెలుపే పేదవర్గాలకు బలమని, ప్రజలంతా ఆయనకు అండగా నిలవాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే రమేష్‌బాబు బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్‌ను వ్యాపారులకు పరిచయం చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో తమ ఇరువురికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో యువనేత సింహాద్రి వికాస్, మండల ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగాయలంకలో ప్రచారంలో డాక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే రమేష్‌బాబు, వికాస్ తదితరులు

అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం

పురిటిగడ్డ(చల్లపల్లి): అక్రమ రేషన్ బియ్యం నిల్వ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని సీఐ సీహెచ్ నాగప్రసాద్ హెచ్చరించారు. మండల పరిధిలోని పురిటిగడ్డ శివారు నిమ్మగడ్డలో బుధవారం రాత్రి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఎం.వెంకటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావులకు చెందిన రెండు బ్రాయిలర్ కోళ్ల ఫారాల్లో చెరో పది క్వింటాళ్ల చొప్పున అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సీహెచ్ చినబాబు, వీఆర్వో కిరణ్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

చల్లపల్లి: ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.సుమతి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ బుధవారం రాత్రి చల్లపల్లి మీదుగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అడ్డుకుని, రూ.50వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. నడకుదురు వద్ద ఎనిమిది ఎడ్ల బళ్లకు రూ.రెండు వేల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో చల్లపల్లి ఎస్‌ఐ సీహెచ్ చినబాబు, ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్వోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.